క్లుప్తంగా

విద్యుత్ స్మార్టు మీటర్లను ఉపసంహరించుకోవాలి

జమ్మలమడుగు : కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై విద్యుత్ స్మార్టు మీటర్లు పెట్టి ప్రజలపై భారీగా భారం మోపనుందని వెంటనే ఉపసంహరించుకోవాలని అఖిల పక్ష నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో వివిధ ప్రజా సంఘాలు, పార్టీ నాయకులు విద్యుత్ స్మార్టు మీటర్ల బిగింపునకు వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. బొగ్గు గనులు, సోలార్, ఐడల్ గాలిమరల విద్యుత్‌ను కార్పొరేట్‌కు అప్పగిస్తున్న మోదీ ప్రభుత్వంపై దశల వారిగా పోరాటం చేయడం కోసం అందరు కలిసి రావాలన్నారు. బీజేపీ పాలిత ప్రాంతాలలోనే స్మార్టు మీటర్ల బిగింపును ప్రజలు, ప్రభుత్వాలు వ్యతిరేకిస్తున్నాయని మన రాష్ట్రంలో కూడా రైతులకు స్మార్టు మీటర్లు బిగింపు సరైంది కాదన్నారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పులివెందుల రూరల్ : పట్టణంలోని శ్రీవెంకటేశ్వరస్వామి గుడి నుంచి బైపాస్ రోడ్డులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మెయింటెన్స్ కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ జగదీశ్వరరెడ్డి తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

వేంపల్లె : గ్రామీణ ప్రాంతాల్లో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడమే ప్రభుత్వ లక్ష్యమని బక్కన్నగారిపల్లె సర్పంచ్ మల్లయ్య తెలిపారు. శనివారం మండలంలోని తాళ్లపల్లె, కత్తలూరు, బక్కన్నగారిపల్లె గ్రామాల్లో ఆయన సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు, సచివాయల కన్వీనర్లకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఏ ఒక్కరికి కూడా సంక్షేమ పథకాలు మిస్సవ్వకుండా మరోసారి ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో తాళ్లపల్లె సర్పంచ్ మారెం సులోచనమ్మ, ఎంపీటీసీ పంగా కళ్యాణి, ప్రజాప్రతినిధులు, గృహ సారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

చెన్నూరు : అర్హులుగా ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందని వారికి ఆయా పథకాలు అందించడంతోపాటు ప్రజలకు అవసరమైన పత్రాలను అందించేందుకు జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేయడం జరుగుతోందని పంచాతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, సర్పంచ్ సిద్దిగారి వెంకటసుబ్బయ్యలు తెలిపారు. శనివారం చెన్నూరులోని రెడ్డివారివీధి, చౌడమ్మ వీధి, రామాలయం వీధి, మట్టవారి వీధి, అరుంధతినగర్‌లలో వారు వలంటీర్లతో కలిసి పర్యటించి అక్కడి ప్రజలతో సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. సమస్యలు ఉంటే వలంటీర్లకు తెలిపితే వెంటనే వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్‌లు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


జగనన్న సురక్ష సర్వే తనిఖీ



పెద్దకుడాల గ్రామంలో పర్యటిస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్, తదితరులు

లింగాల : పెద్దకుడాల సచివాలయంలో జులై 1వ తేదీన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందుకోసం వలంటీర్లు సచివాలయ పరిధిలోని పెద్దకుడాల, చిన్నకుడాల, అక్కులగారిపల్లె, తేర్నాంపల్లె గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వే కార్యక్రమంపై శనివారం ఎంపీడీఓ సురేంద్రనాథ్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, సచివాలయ స్పెషలాఫీసర్ ఎంఈఓ నారాయణరెడ్డిలు తనిఖీలు నిర్వహించారు. సచివాలయ పరిధిలోని అధికారులను నాలుగు బృందాలుగా విభజించి ప్రతి కుటుంబాన్ని సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు.

ప్రతి ఒక్కరూ చట్టాల గురించి తెలుసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి ఎస్.భార్గవి

జమ్మలమడుగు రూరల్ : సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాల గురించి తెలుసుకోవాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.భార్గవి తెలిపారు. శనివారం పట్టణంలోని సబ్‌జైల్‌లో ఖైదీలకు ఆమె న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తప్పు చేయడం సహజమని తరువాత వారిలో మార్పు రావాలని ఆమె సూచించారు. క్షణికావేశంతో చేసిన పొరపాట్ల వలన వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడవలసి వస్తుందన్నారు. అనంతరం లోక్ అదాలత్ గురించి ఆమె వివరించారు. కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు కేరాఫ్.. ఆంధ్రప్రదేశ్

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : సంక్షేమ పథకాలకు కేరాఫ్ ఆంధ్రప్రదేశ్ అని, ప్రపంచంలో ఎక్కడా లేనన్ని పథకాలు రాష్ట్రంలో అమలు అవుతున్నాయని అది కేవలం జగనన్న సీఎం కావడంతోనే సాధ్యమైందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం కమలాపురం వార్డు-1 సచివాలయం పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. పట్టణ నాయకులు పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చుతూ డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికారు. రేషన్ కార్డు, సీసీ రోడ్లు, ఇంటి స్థలాలు, పక్కా గృహాలు కావాలని ప్రజలు కోరడంతో అక్కడే ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించారు. ఇంకా పథకాలు రానివారు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని ప్రజలకు సూచించారు. మీ సమస్యలు తెలుసుకోవడానికే, అపరిష్కృతంగా ఉన్న సమస్యలను సంతృప్త స్థాయిలో పరిష్కరించడం కోసమే జగనన్న సురక్ష అనే కార్యక్రమాన్ని సీఎం జగనన్న ప్రారంభించారన్నారు. అర్హులుగా ఉన్నప్పటికి ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకుండా ఉంటే వారిని గుర్తించి పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. అవ్వా తాతలకు వారి మనవడు జగనన్న ఇస్తున్న పింఛన్ రూ.2750 దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వడం లేదన్నారు. చంద్రబాబు నాయుడు గతంలో దొంగ హామీలిచ్చి సీఎం అయ్యారని అయినా ఒక్కటి నెరవేర్చలేదన్నారు. బాబు తన పాలనంతా అవినీతికి కేర్‌ఆఫ్‌గా పెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మహ్మద్ సాదిక్, గఫార్, హిదాయత్, జావీద్, ఇర్ఫాన్, రెడ్డికరీం, ఫారుక్, సలీమ్, ఇమ్రాన్, టి.రంతు, మోహసిన్, మన్సూర్, నూర్, మోనార్క్, జిలానీ, మండల, జిల్లా నాయకులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత

వల్లూరు : రాష్ట్రంలోని ప్రజల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు నందిస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలోని వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి పనులకు సైతం అంతే ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి, ఏపీఎస్ఆర్‌టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డిలు తెలిపారు. వల్లూరు నుంచి పుష్పగిరి మీదుగా చెన్నూరు మండల పరిధిలోని ఉప్పరపల్లె వరకు సీఆర్ఐఎఫ్ నిధులు రూ.22.20 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం వారు భూమి పూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తైతే పుష్పగిరి పుణ్యక్షేత్రంతోపాటు పర్యాటక కేంద్రమైన ఆదినిమ్మాయపల్లె ఆనకట్టకు, పలు గ్రామాలకు సౌకర్యవంతంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి, జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి, ఎంపీటీసీ గంగయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, డీఈ షాషా వలీ, ఈఈలు ప్రభాకర్‌నాయుడు, నరసింహారెడ్డి, జేఈ సునీల్, తహసీల్దార్ శంకర్‌రావు, వైఎస్ఆర్‌సీపీ నేతలు కిషోర్‌కుమార్, పిచ్చిరెడ్డి, బాలవీరారెడ్డి, బాలిరెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నారాయణరెడ్డి, ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, టీవీ సుబ్బారెడ్డి, వెంకట్రామిరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు మహబూబ్‌బాషా, పంచాయతీ కార్యదర్శి రామ్మూర్తి పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి



జగనన్న సురక్ష పథకం సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ పి.జగన్నాథ్

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలో జరుగుతున్న జగనన్న సురక్ష పథకంను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. శనివారం 1వ వార్డు సచివాయల పరిధి, 20వ వార్డు కౌన్సిల్ పరిధిలో జరుగుతున్న జగనన్న సురక్ష పథకం సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. సచివాలయంలో క్యాంపులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఓ గంగిరెడ్డి, డీపీఓ, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



జగనన్న సురక్ష గురించి వివరిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

కమలాపురం : అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని మండల తహసీల్దార్ అలీఖాన్, మండల స్పెషలాఫీసర్ నరసింహారెడ్డి తెలిపారు. శనివారం జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నల్లింగాయపల్లె సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గడప గడపకు వెళ్లి అర్హులుగా ఉండి సంక్షేమ పథకాలు రాని వారు ఎవరైనా ఉన్నారా? అని పరిశీలించారు. అలాంటి వారు ఎవరైన ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వారికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ధనుంజయరెడ్డి, గృహ సారథులు దేవి, ప్రదీప్‌రెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

సీకేదిన్నె ఎంఈఓ 2గా రమాదేవి



రమాదేవిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



ఎంఈఓ2 రామచంద్రారెడ్డిని సత్కరిస్తున్న ఏపీయూఎస్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

చింతకొమ్మదిన్నె : మండల విద్యాధికారి-2గా రమాదేవి శనివారం బాధతలు చేపట్టారు. ఈ సందర్భంగా అంగడి వీధిలోని పాఠశాలలో ఆమెను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకట్రామిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల ఎంఈఓ 2గా వెంకటేశ్వర్లు

ఎర్రగుంట్ల : మండల విద్యాశాఖ అధికారి 2గా జీ వెంకటేశ్వర్లు శనివా రం బాధ్యతలు చేపట్టా రు. ఈయన రాజుపాలెం మండలం ఎంఈఓగా పనిచేస్తూ బదిలీపై ఎర్రగుంట్ల ఎంఈఓ 2గా వచ్చారు. అనంతరం పట్టణంలోని దొండపాడులో ఉన్న ప్రభుత్వ పాఠశాలను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

చక్రాయపేట ఎంఈఓ 2గా రామచంద్రారెడ్డి

చక్రాయపేట : మండల ఎంఈఓ-2గా రామచంద్రారెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఏపీయూఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయప్రసాద్ మాట్లాడుతూ నూతన ఎంఈఓ2గా బాధ్యతలు చేపట్టిన రామచంద్రారెడ్డికి మండలంలో విద్యా వ్యవస్థను ఉన్నతస్థాయికి తీసుకెళ్లాలన్నారు. అందుకు ఏపీయూఎస్ పక్షాన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఎంఈఓ2 రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఏపీయూఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎరికల్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రకాష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు భోగేశ్వరయ్య, మండల, కోశాధికారి మల్లేశ్వరయ్య, హనుమంతు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామంలో సురేంద్రనాథ్‌రెడ్డి అంత్యక్రియలు



సురేంద్రనాథ్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న మేయర్ సురేష్‌బాబు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మూలె సురేంద్రనాథ్‌రెడ్డి (54) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం ఆయన స్వగ్రామైన నిడుజివ్వి గ్రామంలో అంత్యక్రియలు జరిగాయి. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ జిల్లా మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, నిడుజివ్వి గ్రామ పెద్దలు, కార్మిక సంఘాల నాయకులు, తెదేపా ప్రొద్దుటూరు ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ పరిధిలోని అన్ని మండాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని సంతాపం తెలియజేశారు. సురేంద్రనాథ్‌రెడ్డి 1994-1999లో నిడుజివ్వి ఎంపీటీసీగా గెలిచి అప్పటి నుంచి కార్యకర్తలకు పెద్ద దిక్కుగా ఉండేవారు. ఆయన మండలంలో పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు బాలయ్య, రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు సంతాపం సభ

ఎర్రగుంట్ల : పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఎం.సురేంద్రనాథ్‌రెడ్డి సంతాప సభ నిర్వహిస్తున్నట్లు పార్టీ శ్రేణులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలందరూ ఈ సంతాప సభలో పాల్గొనాలని వారు కోరారు.

నిధుల స్వాహాపై కలెక్టర్‌ను కలిసిన వీఓఏలు



డీఆర్‌డీఏ పీడీని కలిసి తమకు న్యాయం చేయాలని కోరుతున్న వీఓఏలు

వల్లూరు : వల్లూరు వైఎస్ఆర్ క్రాంతి పథకంలో గ్రామ సంఘాల ఖాతాల నుంచి నిధుల స్వాహా విషయమై మండలంలో పనిచేస్తున్న వీఓఏలు (అనిమేటర్లు) శనివారం జిల్లా కలెక్టర్ విజయ రామరాజును కలిశారు. మండలంలో పనిచేస్తున్న 30 మంది వీఓఏలు కడప కలెక్టరేట్‌లో ఆయనను కలిసి సీసీ స్వాహా చేసిన నిధులకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి దుర్వినియోగం చేసిన నిధులను రికవరీ చేసి తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందచేశారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్ రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందచేశారు,

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు

చింతకొమ్మదిన్నె : గ్రామాల్లోని ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్యాధికారి నాగరాజు తెలిపారు. శనివారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ప్రాథమిక ఆరగ్య కేంద్రంలో మందులను పూర్తిస్థాయిలో ఉంచుకోవాలన్నారు. గర్భిణులకు ఇమ్యూనైజేషన్ సకాలంలో వేయాలన్నారు. ఇళ్ల మధ్యలో నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జిల్లా వైద్యాధికారి ఖాదర్ వల్లి, మండల వైద్యాధికారి రాఘవేంద్ర, సీహెచ్ఓ సుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై వడ్డీ మినహాయింపు

కడప కార్పొరేషన్ : ఈ ఏడాది మొదటి అర్థ సంవత్సరానికి చెల్లించాల్సిన ఆస్తి పన్నులపై రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ మినహాయింపు ఇచ్చిందని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ఆస్తి పన్ను యజమానులు ఈ సదావకాశమును సద్వినియోగం చేసుకొని జూన్ 30లోపు తమ పన్నులను చెల్లించి వడ్డీ మినహాయింపు పొందాలని సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారాగానీ, సంబంధిత వార్డు సచివాలయంలోగానీ, ఆన్‌లైన్ ద్వారాగానీ ఆస్తి పన్నులను చెల్లించేందుకు అవకాశం కల్పించామని పేర్కొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

మెజిస్ట్రేట్ లావణ్య



రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ లావణ్య

కమలాపురం : తెలిసో తెలియకో క్షణికావేశంలో చేసిన తప్పులతో కుటుంబ సభ్యులకు దూరంగా ఉండాల్సి ఉటుందని, కనీసం జైలు నుంచి వెళ్లాకైన సత్ప్రవర్తనతో మెలగాలని కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ లావణ్య తెలిపారు. శనివారం స్థానిక సబ్‌జైలును పరిశీలించిన ఆమె రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. మీకు ఏవైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ముఖ్యంగా క్షణికావేశంలో చేసిన తప్పులకు జైలుకు వచ్చి ఉంటారని, దీంతో కుటుంబ సభ్యులకు దూరంగా ఉండాల్సి వస్తుందన్నారు. ఇలాంటి తప్పులు తిరిగి చేయకుండా జైలు నుంచి బయటకు వెళ్లాక సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. అపుడే అందరికితో కలసి ఉండవచ్చని, సమాజంలో గౌరవం, గుర్తింపు ఉంటాయన్నారు. అనంతరం గురుకుల పాఠశాలను సందర్శించి, విద్యార్థినులతో ముచ్చటించారు. మీకేమైన సమస్యలున్నాయా? అని ప్రశ్నించారు. మీరు బాల్య వివాహాలు చేసుకోరాదని, అది చట్టరీత్యా నేరమన్నారు. దాని వలన అనేక అనర్థాలు కలుగుతాయన్నారు. మీపై ఎవరైన అఘాయిత్యాలకు పాల్పడితే దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు లేదా 100కు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ గంగాధర్, ప్రిన్సిపాల్ తులశమ్మ, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

కడప రాయుని సన్నిధిలో కొత్త పథకాలు

కడప కల్చరల్ : తిరుమల-తిరుపతి దేవస్థానాల పరిధిలోని దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో నాలుగు కొత్త పథకాలను అమలు చే సేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు తొలి కార్యక్రమంగా భక్తుల అన్నదానం శనివారం ప్రారంభించారు. టీటీడీ కడప రాయుని సన్నిధిలో ఇందులో భాగంగా భక్తులు ఆలయ ప్రాంగణంలో అ న్నదానం చేయడం ప్రధాన కార్యక్రమంగా భావిస్తున్నారు. శనివారం ఈ కార్యక్రమాన్ని శ్రీ లక్ష్మి వెంకటేశ్వరుని సాక్షిగా ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో ప్రారంభించారు. స్థానిక భక్తులు ఏ శనివారమైనా తమ ఖర్చుతో అన్నదానికి అవసరమైన అన్నం, కూరలు తీసుకు రావాల్సి ఉంటుంది. వాటిని కల్యాణ మండపంలో ఆలయ అధికారుల సహకారంతో అన్నదాతలు భక్తులకు వడ్డిస్తారు. ఇందులో భక్తుల సంఖ్య గురించి పట్టింపు లేదు. మొక్కుగల వారు తమ ఆర్థికశక్తిని బట్టి 50, 100, 150 మందికి తామే అన్నాన్ని ఏర్పాటు చేయవలసి ఉంటుంది. మధ్యాహ్నం 11.30 గంటలకు ఆలయ పూజా కార్యక్రమాలు పూర్తయిన వెంటనే ఆ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో భక్తులకు అన్నదానం చేయనున్నారు. శనివారం తొలి అన్నదానం ప్రారంభమైంది. దాతలు దాదాపు 200 మందికి పైగా భక్తులకు అన్నదానం చేశారు.

విశేష స్పందన

పెద్దగా ప్రచారం లేకపోయినా ఈ కార్యక్రమానికి విశేషమైన స్పందన లభిస్తోంది. వచ్చే వారం అన్నదానానికి ఓ భక్తుడు సిద్ధమై పేరు నమోదు చేయించగా, శ్రావణమాసంలోని నాలుగు శనివారాలు తామే అన్నదానం చేయిస్తానని మరొక భక్తుడు ముందుకు వచ్చి పేరు నమోదు చేసుకున్నారు.

విశేష పూజలు

అన్నదానంతోపాటు విశేష పూజల పథకాన్ని కూడా టీటీడీ అధికారులు అనుమతించారు. ఇందులో భాగంగా 1000, 5000, 10,000 స్కీములను రూపొందించారు. రూ. 10 వేలు ఒకేసారి దేవునికడప ఆలయ అధికారులకు అందజేసి రశీదు తీసుకుంటే 10 ఏళ్ల పాటు సంవత్సరానికి 30 రోజులపాటు ఆ వ్యక్తి పేరిట స్వామి, అమ్మవార్ల సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాన్ని అందజేస్తారు. రూ. 5 వేలు చెల్లించిన వారికి ఐదు సంవత్సరాలపాటు ఏటా 30 రోజులపాటు ఈ పూజలు చేసి ప్రసాదం అందజేస్తారు. రూ. 1000 అందజేసిన వారికి సంవత్సరంపాటు ఈ పథకం అమలవుతుంది. ఈ పథకాల కారణంగా ఈ క్షేత్రంలో శనివారాలతోపాటు ఇతర రోజుల్లో కూడా భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

పెండింగ్ వేతనాలను చెల్లించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : స్వచ్ఛ భారత్‌లోని హరిత రాయబారులకు 15 నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు కేసీ బాదుల్లా పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హరిత రాయబారులకు 15 నెలలుగా వేతనాలను చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ కష్టతరంగా మరిందన్నారు. ఈ విషయమై 26న ఎంపీడీఓ కార్యాలయాల వద్ద నిరసన, జులై 3న స్థానిక ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు, జులై 10న కలెక్టరేట్ ఎదుట ఆందోళనలుంటాయన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ దినేష్‌కుమార్‌రెడ్డి కిడ్నీలో రాళ్లు, కిడ్నీ వాపు, కిడ్నీలో గడ్డలు, కిడ్నీ అండ్ యూరిన్ ఇన్ఫెక్షన్, మూత్ర సమస్యలు, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ వైద్యులు డాక్టర్ డి.వి.నారాయణరెడ్డి ఆసుపత్రిలో 24 గంటలు అందుబాటులో ఉండి ఎండోస్కోపీ, కోలోనోస్కోపీ, అన్ని జీర్ణకోశ, లివర్, ప్యాంక్రియాస్ క్యాన్సర్‌లకు ఆపరేషన్లు చేస్తారన్నారు. అలాగే ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. షుగర్ పరీక్షలు చేయించుకోవాలనుకునేవారు పడగడపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

గొరిగెనూరులో అభివృద్ధి పనులు ప్రారంభం



గొరిగెనూరులో జరుగుతున్న పనులు

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధిలోని గొరిగెనూరులో ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే వారి సమస్యలను పరిష్కరిస్తానని మాటఇచ్చారు. అందులో భాగంగా పలు కాలనీల్లో రోడ్లు, కాల్వలు ఏర్పాటుకు డీఎంఎఫ్ నిధుల కింద రూ.78 లక్షలతో కాల్వలు, రూ.40 లక్షలతో రోడ్లు, నాడు-నేడు కింద రూ.46 లక్షలతో పాఠశాలల్లో మౌలిక వసతులకు పనులను సర్పంచ్ మత్తయ్య ప్రారంభించారు.

'కంటి వెలుగు' ప్రజలకు ఓ వరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న కంటి వైద్యుడు

జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం నిరుపేద ప్రజలకు ఓ వరం లాంటిందని కంటివైద్యుడు తేజ తెలిపారు. శనివారం మండలంలోని గూడెంచెరువు గ్రామంలో ఆయన కంటివెలుగు కార్యక్రమంలో ప్రజలకు కంటి పరీక్షలను నిర్వహించి మాట్లాడారు. దృష్టి లోపం వుంటే వెంటనే వైద్యులను సంప్రదించి వారి సూచనలు మేరకు కంటి అద్దాలను వాడాలన్నారు. 73 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అందులో కొంత మందికి కంటి అద్దాలు రెఫర్ చేసి మరికొంత మందికి కంటిలో శుక్లాలు రావడంతో వారికి ఆపరేషన్లు అవసరం అని గుర్తించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ తస్మియా, దీపిక, సీహెచ్ఓ సన్ని, సలోని ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

స్కార్పియో బోల్తా

కలసపాడు : మండలంలోని పిడుగుపల్లె - శంఖవరం గ్రామాల మధ్యలో మలుపు వద్ద శనివారం స్కార్పియో బోల్తాపడటంతో ఐదుగురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఎగువ తంబళ్ళపల్లె గ్రామంలో జరిగిన ఓ వివాహానికి హాజరై తిరిగి సొంత గ్రామమైన ప్రొద్దుటూరుకు స్కార్పియో వాహనంలో వెళుతుండగా మార్గంమధ్యలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో స్కార్పియోలో ప్రయాణిస్తున్న సమీర్‌తోపాటు మరో నలుగురికి గాయాలయ్యాయి.